## క్లుప్తంగా

### మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు

వెల్గటూర్: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. పది రోజుల క్రితం మండల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా.. ఊత్కూర్‌కు చెందిన వ్యక్తి కండ్లె ప్రశాంత్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుపడ్డాడు. ఆ వ్యక్తిని కోర్టులో హాజరుపర్చగా.. మద్యం తాగి వాహనం నడిపినందుకు గాను మేజిస్ట్రేట్ యేగి జానకి పది రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

### తాట్లవాయిలో కుక్కల స్వైర విహారం

రాయికల్: తాట్లవాయి గ్రామంలో కుక్కలు బుధవారం రాగి గంగవ్వ, కొండవేని గంగమల్లయ్యపై దాడి చేశాయి. వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఐదు గేదెలు, ఒక ఆవుపై కుక్కలు దాడి చేసినట్లు బాధితులు తెలిపారు.

### అనారోగ్యంతో యాచకురాలు మృతి



మల్యాల: దిగువ కొండగట్టు బస్టాండులో యాచకురాలు అనారోగ్యంతో మృతిచెందింది. సైదాపూర్ మండలం ఘనపూర్‌కు చెందిన భద్రమ్మ(55) ఐదేళ్ల నుంచి కొండగట్టు పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. ఈక్రమంలో అనారోగ్యంతో బుధవారం మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. మృతురాలి కుమారుడు లగావత్ శ్రీహరి వచ్చి తాము నిరుపేదలమని, ఇక్కడే దహన సంస్కారాలు పూర్తి చేయాలని కోరాడు. ఎస్సై నరేశ్‌కుమార్ సహకారంతో కానిస్టేబుల్ మధుసూదన్‌రెడ్డి స్థానిక శ్మశాన వాటికకు తరలించి ఖననం చేశారు.

### స్థానిక సంస్థల్లో అన్ని స్థానాలూ గెలుపొందాలి



సమావేశమైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

పెగడపల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు అన్ని గెలుపొందేలా ప్రతీ ఒక్కరు సైనికుల్లా పని చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లోక మల్లారెడ్డి అన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు బుధవారం మద్దులపల్లిలో లోక మల్లారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వెల్మ సత్యనారాయణ, సంతోష్, రాఘవరెడ్డి, తిరుపతిరెడ్డి, నరేందర్‌రెడ్డి, లక్ష్మణ్, నరసింహారెడ్డి, మునయ్య పాల్గొన్నారు.

### ఇరిగేషన్ డీఈగా మురళీకృష్ణ



డీఈని సన్మానిస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం: ఇరిగేషన్ సబ్ డివిజన్ డీఈగా గుడిపెల్లి మురళీకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ అడిషనల్ ఇన్‌చార్జిగా పని చేసిన మల్లాపూర్ డీఈ దేవనందంకు మల్లాపూర్ పూర్తి బాధ్యతలు అప్పగించడంతో.. మురళీకృష్ణ రామగుండం డివిజన్ 3, సబ్ డివిజన్ గోళివాడ నుంచి బదిలీపై వచ్చారు. సిబ్బంది సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి ఆహ్వానించారు. డీఈ అరుణోదయకుమార్, ఏఈలు సజీత్, చేతన్, కవిత, లస్కర్లు పాల్గొన్నారు.

### విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా రాజ్‌కుమార్



ఎన్నికైన సభ్యులు

గొల్లపల్లి: మండల కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ భవనంలో గాయత్రీ మాత విశ్వబ్రాహ్మణ యువజన సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిప్పర్తి రాజకుమార్, ఉపాధ్యక్షులుగా మారుపాక లింగబాబా, యదులాపురం నరసింహచారి, దుంపెట్ సందీప్, ప్రధాన కార్యదర్శిగా సజ్జనకు రవి, సహాయ కార్యదర్శిగా ఇందూరు నిరంజన్‌చారి, కోశాధికారిగా శ్రీకోటి నీలకంఠం, గౌరవాధ్యక్షుడిగా దేవరకొండ కరుణాకర్, సలహాదారులుగా పోలుకల దీపక్, తుమ్మనపల్లి బ్రహ్మచారి, సభ్యులుగా ఎదులాపురం సాయికుమార్, రాగి వెంకటేశ్, సజ్జనపు భూమాచారి, గురుచరణ్ దుంపేటి ప్రణయ్ ఎన్నికయ్యారు.

# ఈ గుంతలు.. యమపాశాలు..





వారం క్రితం యువతి జారి పడి మరణించిన ప్రదేశం, కొడిమ్యాల నుంచి వేములవాడ వెళ్లే రహదారిలో అధ్వానంగా రోడ్డు

- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు

కొడిమ్యాల: మండల కేంద్రం నుంచి వేములవాడకు వెళ్లే ప్రధాన రహదారిలో ఎక్కడ చూసినా గుంతలే. రోడ్డు మధ్యలో ఏర్పడిన పెద్ద గుంతలపై లారీలు, ట్రక్కులు, బస్సులు వెళ్లే కొద్దీ అవి మరింత లోతుగా మారాయి. ఈ గుంతలు ప్రయాణికులకు అసౌకర్యం కలిగించడమే కాదు.. ద్విచక్ర వాహనదారులకు యమపాశాల్లా మారి ప్రమాదాలకు నిలయంగా మారాయి. గుంతలను తప్పించే క్రమంలో వాహనాలు అదుపుతప్పడం, ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొట్టుకోవడం తరచూ జరుగుతోంది. వారం క్రితం చెప్యాల గ్రామ శివారులోని ఈ రహదారిపైనే గుంత కారణంగా వేగం అదుపు చేయలేక మమత అనే యువతి ద్విచక్ర వాహనంపై నుంచి జారి పడి మరణించిన ఘటన ఇప్పటికీ ప్రజల మదిలో ఉంది. ఇదే రహదారిపై ఇప్పటికే అనేకమంది కింద పడి గాయపడగా.. కొందరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఇంత ప్రాణ నష్టం జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గుంతలు మూసే తాత్కాలిక పనులు కాకుండా శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, వాహనదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**జంకుతున్నాం..**



రోడ్డు గుంతలుగా ఉండడంతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనాలు నడిపేందుకు జంకుతున్నాం. అధికారులు వెంటనే స్పందించి బాగు చేయాలి. – అశోక్, చెప్యాల గ్రామస్తుడు



నల్లగొండ నరసింహస్వామి ఆలయం ఎదుట రోడ్డుపై మలుపు వద్ద నీటి గుంత



కథలాపూర్: చింతకుంట–పెగ్గెర్ల గ్రామాల నుంచి మెట్‌పల్లి పట్టణం వరకు తారు రోడ్డు ఉంది. కానీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ప్రయాణానికి ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేది. రెండేళ్లుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. కథలాపూర్ నుంచి మెట్‌పల్లి పట్టణానికి వెళ్లాలంటే కోరుట్ల పట్టణం మీదుగా అదనంగా 10 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తోందన్నారు. మెట్‌పల్లి నుంచి చింతకుంట బస్సు సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
దేవరాజ్, ఆర్టీసీ డీఎం, మెట్‌పల్లి, సెల్ నంబర్: 9959225927

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

### రవాణా చార్జీలు చెల్లించాలి



శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న చెరుకు రైతులు

మెట్‌పల్లి: చెరుకు తరలింపునకయ్యే రవాణా చార్జీలను ప్రభుత్వం చెల్లించేలా చూడాలని కోరుతూ రైతులు పీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజీత్ రావు ఆధ్వర్యంలో బుధవారం జగిత్యాలకు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ మూసేయడంతో కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతం నుంచి చెరుకును కామారెడ్డి ఫ్యాక్టరీకి తరలిస్తున్నామని వివరించారు. మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్ వాకిట సత్యంరెడ్డి, చెరుకు రైతు సంఘం నాయకులు సోమరెడ్డి, పూండ్ర శ్రీనివాస్, నారాయణరెడ్డి, జీవన్, లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

### బురుజులను పరిరక్షించాలి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణంలోని గడి బురుజులను పరిరక్షించాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌ను కోరారు. బుధవారం నిజామాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని కొందరు నాయకులు, రియాల్టర్లు కుమ్మక్కయి దసరా ఉత్సవాల్లో భాగంగా ఆనవాయితీగా వస్తున్న మహిషాసుర వధ చేసే స్థలంతోపాటు గడి బురుజులు, కోనేరును ఆనుకొని ఉన్న స్థలాలను కబ్జా చేసి పాత జీవోల స్థానంలో కొత్త జీవోలు తెచ్చి విక్రయించే కుట్ర చేస్తున్నారని వివరించారు. సంబంధిత పురావస్తు శాఖ అధికారులతో మాట్లాడి పురాతన కట్టడాలైన గడి బురుజుల స్థలాన్ని పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. చెన్నా విశ్వనాథం, తిరుపతినాయక్, చింతా భూమేశ్వర్, పేట భాస్కర్, నగేశ్ పాల్గొన్నారు.



ధర్మపురి: ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు, గ్రామస్తులు





ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్ అశోక్, డీఈవో రాము

### డ్రగ్స్ బారిన పడొద్దు

ధర్మపురి: సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు ఉదయ్‌కుమార్, రవికుమార్ బుధవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద మాదక ద్రవ్యాల నిర్మూలనపై పట్టణ ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఎస్సై మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తూ యువకులు డ్రగ్స్ బారిన పడొద్దని సూచించారు. సిబ్బంది వెంకటయ్య, రమేశ్‌నాయక్, గ్రామస్తులు తదితరులున్నారు.

జగిత్యాల: యువత డ్రగ్స్‌తో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ అన్నారు. బుధవారం మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో యువత అప్రమత్తంగా ఉండాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక కార్గిల్ చౌక్ వద్ద ప్రజలు, యువకులు సీఐ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఎస్సై చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

### రోడ్డుపై పారుతున్న నీరు



సారంగాపూర్: బీర్పూర్ మండలం తుంగూర్, ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామాల మధ్య గుట్ట రాజేశ్వరస్వామి ఆలయం సమీపం నుంచి నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. తుంగూర్ ఎగువన ఉన్న శాకసముద్రం ఇప్పటికే నిండింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మత్తడులు దూకుతున్నాయి. రహదారిపై గతంలో ఏర్పాటు చేసిన లోలెవల్ కాజ్‌వే పైపులు చిన్నవి కావడంతో నీరు రోడ్డుపై నుంచి పారుతోంది.

## వరద కాలువతో 30వేల ఎకరాల్లో పంటల సాగు



మల్యాల: ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదలతో వరద కాలువకు జలకళ సంతరించుకుంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రామడుగు నుంచి వరద కాలువపై ఆధారపడి సుమారు 30 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు.

**కార్యవర్గం ఎన్నిక**

మల్లాపూర్: మండల కేంద్రంలోని కిరాణ, వర్తక సంఘం అసోసియేషన్ అధ్యక్షుడిగా కల్లెడ రాజేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన సమావేశంలో కార్యదర్శిగా తోట రాజేశం, కోశాధికారిగా మేడి రాకేశ్, తదితరులు ఎన్నికయ్యారు.

**రక్తదాన శిబిరం**

ధర్మపురి: పట్టణంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ధర్మపురికి చెందిన కస్తూరి శరత్‌కుమార్, బండారి అనిల్ ఆధ్వర్యంలో ధర్మపురి బ్లడ్ బ్యాంక్ అనే పేరుతో వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసి శిబిరాన్ని నిర్వహించారు. అత్యవసర సమయంలో ప్రాణాలను కాపాడేందుకు రక్తదాన శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని 10 సంవత్సరాల నుంచి శిబిరాలను ఏర్పాటు చేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడినట్లు శరత్‌కుమార్, అనిల్ తెలిపారు.

**బయటకు వెళ్లొద్దు**

మల్లాపూర్: భారీ వర్ష సూచన నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని తహసీల్దార్ రమేశ్‌గౌడ్, ఎస్సై రాజు కోరారు. బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

### 108 సిబ్బంది సేవలు ప్రశంసనీయం



సిబ్బందిని అభినందిస్తున్న డీఎంహెచ్‌వో

జగిత్యాల: 108 సిబ్బంది సేవలు ప్రశంసనీయమని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. బుధవారం 108 అంబులెన్స్ సిబ్బందిని అభినందించారు. వాహనంలో ఆక్సిజన్ నిల్వలు, బీపీ ఆపరేటర్, లారింజో స్కోప్ ఎప్పటికప్పుడు చూసుకోవాలని, భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్, కుమారస్వామి, కట్కం భూమేశ్వర్ పాల్గొన్నారు.

### శ్రమదానం

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. అధ్యాపకులు, విద్యార్థులు మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ వెంకయ్య, దేవన్న, బిల్ల రాజేందర్, అంజయ్య, దశరథం, శ్రీకాంత్ తదితరులున్నారు.

### ఫ్రెండ్స్ గాజుల సంబరాలు




గాజులు చూపుతున్న మహిళలు

మేడిపల్లి: వారంతా గ్రామానికి వచ్చిన కోడళ్లు. కొత్తలో ఒకరికొకరు పరిచయం లేదు. ఒక కులం, మతం కాదు. ఇపుడు ఫ్రెండ్స్ అయ్యారు. ఎంతలా అంటే సొంత అక్కాచెల్లెళ్ల కంటే ఎక్కువగా. భీమారం మండలం కమ్మరిపేట గ్రామంలో మొన్న మహిళల బతకమ్మ వేడుకలు మరవకముందే.. వినూత్నంగా ఫ్రెండ్స్ గాజుల వేడుకల కార్యక్రమంతో మళ్లీ మండలవ్యాప్తంగా ఫేమస్ అయ్యారు. గ్రామానికి వచ్చిన కోడళ్లు ఎప్పుడు ఇంటి పనులు, పిల్లలు, వ్యవసాయ పనుల్లో బిజీ ఉంటారు. అలాంటి గ్రామంలో కోడళ్లందరూ సుమారు 100 మంది ఒక్కచోట కలిసి ఫ్రెండ్స్ గాజుల వేడుకలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టినిల్లు నుంచి మెట్టినింటికి వచ్చిన మేము కష్టాలు, సుఖాల్లో అక్కాచెల్లెళ్లలా కలిసిపోయామని, అందుకే శ్రావణ మాసం సందర్భంగా ఈ ఫ్రెండ్స్ వేడుకలు నిర్వహించామంటున్నారు. ఇందుజ, వర్ష, లక్ష్మి, పద్మ, గంగమ్మ, జ్యోతి, మానస, రజిత, కవిత, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

### డివైడర్లు ఏర్పాటు చేయాలి

రాయికల్: పట్టణంలోని పద్మశాలీ సేవాసంఘం నుంచి పోలీస్ స్టేషన్ వరకు డివైడర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు పిప్పోజి మహేందర్‌బాబు బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

## చెరువులో వ్యవసాయ బావి తవ్వకం



వెల్గటూర్: స్తంభంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి చెరువు పక్కన వ్యవసాయ పొలం ఉంది. ఈ పొలంలో వరి సాగు చేసేందుకు సాగునీటి కోసం పొలానికి పక్కనే ఉన్న చెరువు స్థలంలో వ్యవసాయ బావి తవ్వాడు. ఈ విషయమై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో.. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు వెళ్లి వ్యవసాయ బావిని పరిశీలించి రైతును హెచ్చరించారు. 2 రోజుల్లో బావిని పూడ్చకుంటే కేసు నమోదు చేస్తామన్నారు. రాజేశ్వరి, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

### అధికారులు అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో సలీమ్

ఇబ్రహీంపట్నం: వర్షాలు కురుస్తున్నందున మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సలీమ్ అన్నారు. బుధవారం తహసీల్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలు పడుతున్నందున చెరువులు, కుంటలు ఎన్ని ఉన్నాయి, ఏమైనా తెగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయా అని తెలుసుకున్నారు. ఆర్అండ్‌బీ ఏఈ, పంచాయతీరాజ్ ఏఈ గైర్హాజరయ్యారు. వైద్యాధికారి హరీశ్‌కుమార్, ఏవో రాజ్‌కుమార్, భగీరథ ఏఈ మల్లేశం, ఇరిగేషన్ ఏఈలు సజీత్, చేతన్, కవిత, ట్రాన్స్‌కో ఏఈ సతీశ్, పశు వైద్యాధికారి శైలజ, ఏఎస్ఐ పాల్గొన్నారు.

కోమటికొండాపూర్, ఎర్దండి గోదావరిని ఎంపీడీవో సందర్శించారు. భారీ వర్షాలు నేపథ్యంలో శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి గోదావరిలోకి ఎప్పుడైనా నీటిని విడుదల చేసే అవకాశాలున్నందున నది పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. అమ్మక్కపేట గ్రామంలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. రోడ్డు పక్కన మొక్కలకు చేస్తున్న సాసార పనులను పర్యవేక్షించారు. కార్యదర్శులు సరిత, మనోజ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మల్యాల: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేశ్‌కుమార్ అన్నారు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద అప్రమత్తంగా వ్యవహరించాలని, వర్షంలో విద్యుత్ స్తంభాలు, తీగలు ముట్టుకోవద్దని సూచించారు.

### శిథిల భవనాల్లో ఉండొద్దు



యెఖీన్‌పూర్‌లో శిథిలావస్థలో ఉన్న ఇల్లును పరిశీలిస్తున్న కమిషనర్

కోరుట్ల: వర్షాల నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్ అన్నారు. పట్టణంలోని పలు వార్డులతోపాటు మున్సిపల్ విలీన గ్రామమైన యెఖీన్‌పూర్ గ్రామాన్ని బుధవారం సందర్శించారు. శిథిలావస్థ భవనాల్లో ఉన్న పలువురిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. భవనం మరమ్మతు చేయించుకోవాలని, లేదంటే కూల్చాలని నోటీసు ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

కొడిమ్యాల: రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని ప్రభుత్వం ప్రకటించిన సందర్భంగా మండలంలోని అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో స్వరూప సూచించారు. బుధవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కిరణ్, ఎస్సై సందీప్, ఏఈ చంద్రశేఖర్, ఎంపీవో వెంకటేశ్ పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాలతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీవో చిరంజీవి

రాయికల్: నూతన స్వయం సహాయక సంఘాల అభివృద్ధితోనే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఎంపీడీవో చిరంజీవి అన్నారు. బుధవారం పట్టణంలో మండలంలోని సెర్ప్ ఆధ్వర్యంలో గ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నూతన స్వయం సహాయక, కిశోర బాలికల సంఘాల ఏర్పాటుపై శిక్షణ నిర్వహించారు. ఎంపీవో సుష్మ, బ్యాంక్ మేనేజర్లు పవన్, వినయ్, ఏపీఎం నరహరి, మండల సమైక్య అధ్యక్షురాలు నరహరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండల కేంద్రంలోని శ్రీసాయి మండల సమైక్య కార్యాలయంలో నూతన సంఘాల ఏర్పాటుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సామాజిక చేకూర్పు, నూతన స్వయం సహాయక, విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల, కిశోర బాలికల సంఘాల ఏర్పాటుపై శిక్షణ నిర్వహించారు. శ్రీనివాస్, గంగాధర్, మహేశ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: సంఘాల్లో చేరడం ద్వారా మహిళలకు ఆర్థిక అభివృద్ధితోపాటు మనోధైర్యం లభిస్తుందని ఐకేపీ సెర్ప్ ఏపీఎం మల్లేశం అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో 34 గ్రామ సంఘాల పాలకవర్గ సభ్యులతోపాటు గ్రామ సంఘాల అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుధారాణి, ఉమ మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు అవసరమైన తోడ్పాటును ఐకేపీ సెర్ప్ ద్వారా ప్రభుత్వం అందిస్తోందన్నారు. పద్మ, సునీత, సంధ్య, పద్మ, వీరకుమార్, స్వరూప, మంగ తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: అర్హత కలిగిన మహిళలందరినీ సంఘాల్లో చేర్చాలని ఐకేపీ సెర్ప్ ఏపీఎం శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మేడిపల్లి, భీమారం మండలాలకు చెందిన 37 గ్రామ సంఘాల పాలకవర్గ సభ్యులు, గ్రామ సంఘాల అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవోలు పద్మజ, నీరజ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరోజ, కార్యదర్శి మాలతి, కోశాధికారి వనజ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని శ్రీకనకసోమేశ్వర మండల సమాఖ్య పరిధిలోని గ్రామైక్య సంఘాల పదాధికారులతోపాటు గ్రామ సంఘాల అసిస్టెంట్లకు నూతన సంఘాల ఏర్పాటుపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎం రమేశ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.